క్లుప్తంగా

ప్రహరీ గోడ నిర్మించాలని వినతి



ప్రహరీ గోడ లేని ఆరోగ్య కేంద్రం భవనం

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ గోడ లేదు. దీంతో ఆవరణలో పశువులు, ఇతర జంతువులు వస్తున్నాయి. అంతేగాక జేసీబీలతో పాటు పలు వాహనాలను నిలుపుతున్నారు. పీహెచ్‌సీని గత ప్రభుత్వ హయాంలో రూ.1.50 కోట్లతో నిర్మించారు. ఉన్నతాధికారులు స్పందించి పీహెచ్‌సీకి ప్రహరీ గోడ నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

ఓజిలి: రేషన్ దుకాణాల్లో బియ్యం తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ పద్మావతి హెచ్చరించారు. ఆమె శనివారం డీలర్లతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా 15వ తేదీ వరకు లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. సరుకుల వివరాలతో కూడిన పట్టిక ఏర్పాటుచేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. డీటీ మధుసూదన్‌రాజు, డీలర్ల సంఘం అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందులు



కుప్పారెడ్డిపాళెంలో గొర్రెలకు నట్టల నివారణ మందు తాగిస్తున్న పశువైద్యాధికారులు

దొరవారిసత్రం : మండలంలోని బూదూరు, కుప్పారెడ్డిపాళెం గ్రామాల్లోని గొర్రెలు, మేకలకు శనివారం నట్టల నివారణ మందులు తాగించినట్టు పశువైద్యాధికారిణి శ్రీదేవి తెలిపారు. నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో వచ్చే నెల 9వ తేదీ వరకు పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

10వ రోజు మున్సిపల్ కార్మికుల దీక్ష



వెంకటగిరి రూరల్ : వెంకటగిరి మున్సిపాలిటీలో పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును బదిలీ చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన దీక్ష శనివారం 10వ రోజుకు చేరింది. కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావుపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి సన్మానం



శ్రీనివాసులురెడ్డిని సన్మానిస్తున్న టీచర్లు

కలువాయి(సైదాపురం): మండలంలోని దాచూరు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులు కంటా శ్రీనివాసులు రెడ్డిని శనివారం తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి ప్రత్యేకతను చాటుకున్నారని తెలిపారు.

నెల్లటూరులో ఘనంగా గంగమ్మ జాతర



గంగ పెట్టెను ఊరేగిస్తున్న గ్రామస్తులు

గూడూరు రూరల్ : గూడూరు మండలం నెల్లటూరు గ్రామంలో గంగమ్మ జాతర శనివారం ఘనంగా నిర్వహించారు. గంగ పెట్టె ఊరేగింపు, బోనాల్లో భాగంగా తప్పెట్లు, కొమ్ములోళ్ల మంగళ వాయిద్యాలతో అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు వెంకటగిరికి నేదురుమల్లి రాక

సైదాపురం(వెంకటగిరి) : వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆదివారం వెంకటగిరికి రానున్నారు. ఆయన తన నివాసంలో ఉదయం నుంచి కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉంటారు. ఈ మేరకు నేదురుమల్లి కార్యాలయ వర్గాలు శనివారం ప్రకటన విడుదల చేశాయి.

కూరగాయల మార్కెట్‌కు
మోక్షమెన్నడో..?

గత ప్రభుత్వంలో గూడూరులో అనేక అభివృద్ధి పనులు చేపట్టింది. అందులో కూరగాయల మార్కెట్ నిర్మాణం ఒకటి. దాన్ని రూ.2 కోట్లతో చేపట్టింది. పనులు పూర్తయి ఏడాది పూర్తవుతోంది. దాన్ని ప్రారంభించడానికి కూటమి ప్రభుత్వం వెనకడుగు వేస్తోంది. వాటిని చూస్తే వైఎస్.జగన్ చేసిన అభివృద్ధి ప్రజలకు కనిపిస్తుందని భావించి పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఐదేళ్ల నుంచి ప్రైవేట్ స్థలంలోనే కూరగాయల మార్కెట్‌ను నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, అధికారులు స్పందించి మార్కెట్‌ను ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

- రూ.2 కోట్లతో నిర్మించిన గదులు
- ఏడాది దాటినా ప్రారంభించని వైనం
- ఐదేళ్లుగా ప్రైవేట్ స్థలంలోనే మార్కెట్ నిర్వహణ

చిల్లకూరు : గూడూరు పట్టణ నడిబొడ్డున ఉన్న కూరగాయల మార్కెట్ శిథిలావస్థకు చేరడం



వినియోగంలోకి రాని కూరగాయల మార్కెట్



ప్రైవేట్ స్థలంలో నిర్వహిస్తున్న కూరగాయల మార్కెట్

తోపాటు ఇరుకుగా ఉండేది. 2019లో అప్పటి ప్రభుత్వం మార్కెట్‌ను పునఃనిర్మించేందుకు సిద్ధమైంది. కోవిడ్ విజృంభించడంతో ఐసీఎస్ రోడ్డులోని ఎస్‌ఎంజీ హైస్కూల్‌కు చెందిన క్రీడా మైదానంలో మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అక్కడే కూరగాయల మార్కెట్‌ను నిర్వహిస్తున్నారు. పాత మార్కెట్‌లో శిథిలావస్థకు చేరిన గదులను తొలగించి రూ.2 కోట్లతో నూతన గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంది. ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. తర్వాత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. గత ఏడాది జనవరిలో పనులు పూర్తి చేశాడు. అదేవిధంగా కూరగాయల మార్కెట్ చుట్టూ ఉన్న ఖాళీ స్థలంలో చేపల మార్కెట్‌ను నిర్మించేందుకు గత ప్రభుత్వం రూ.50 లక్షల నిధులు విడుదల చేసింది. పక్కనే నివాసాలు ఉండే కొంతమంది కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిపి వేశారు. దీంతో కూరగాయలు, చేపల మార్కెట్లను ప్రైవేట్ స్థలాల్లోనే వ్యాపారులు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకుని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాదిలోనే చేపల మార్కెట్‌లోని దుకాణాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఎండు చేపలు పూర్తిగా కాలిపోయాయి. వ్యాపారులు తీవ్రంగా నష్టపోయినా అధికారులు నష్ట పరిహారం కూడా ఇవ్వలేదు.

ఆదాయం వస్తున్నా పట్టించుకోని వైనం

కూరగాయలు, చేపల మార్కెట్ల ద్వారా గూడూరు మున్సిపాలిటీకి రూ.లక్షల ఆదాయం వస్తోంది. గతంలో వేలం పాటల ద్వారా రుసుము వసూలు చేస్తుండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపల్ సిబ్బంది నేరుగా రుసుము వసూలు చేస్తున్నారు.

వెలవెలబోతున్న దుకాణాలు

కూరగాయల మార్కెట్‌కు ప్రతి రోజూ విజయవాడ, చెన్నై, బెంగళూరుతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి సుమారు 75 టన్నుల వరకు

గూడూరు మున్సిపాలిటీ జనాభా:	86,949
రోజూ మార్కెట్‌కు వచ్చే లారీలు:	15
కూరగాయలు:	75 టన్నులు

కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు వస్తుంటాయి. గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు, కోట, వాకాడు, వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం, బాలాయపల్లి మండలాలకు చెందిన వ్యాపారులు ఇక్కడికి వచ్చి కూరగాయలు కొనుగోలు చేసుకుని వెళుతుంటారు. ప్రైవేట్ స్థలంలో దుకాణాలు ఉండడంతో బయటి నుంచి వచ్చే వ్యాపారులు అంత దూరం వెళ్లలేక రోడ్డు మార్జిన్లలో ఉండే వ్యాపారుల వద్ద కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో మార్కెట్‌లో వ్యాపారాలు లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి. గూడూరు మున్సిపాలిటీకి ప్రత్యేక అధికారిగా సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్ వ్యవహరిస్తున్నారు. ఏడాది క్రితం మార్కెట్ భవనాలు పూర్తయిన విషయాన్ని అధికారులు ఆయన దృష్టికి తీసుకువెళ్లి వినియోగంలోకి తీసుకువచ్చేలా చూడాలని వ్యాపారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కోర్టులో కేసు ఉన్నందునే..

కూరగాయల మార్కెట్‌కు ఆనుకుని చేపల మార్కెట్ కూడా నిర్మించేందుకు ప్రయత్నించాం. దీంతో పక్కన నివాసాలు ఉన్న వారు కోర్టును ఆశ్రయించారు. కేసు కోర్టులో ఉన్నందున మార్కెట్‌ను స్వాధీనం చేసుకోలేదు. కేసు పరిష్కారమైన వెంటనే మార్కెట్‌ను స్వాధీనం చేసుకుని ప్రారంభించేలా చర్యలు చేపడతాం.

– వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్

శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ



ఊంజల్ సేవకు స్వామి, అమ్మవార్లను తీసుకువస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం సాయంత్రం శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి ఉత్సవ మూర్తులను అలంకార మండపంలోకి వేంచేపు చేసి తిరుచ్చిపై కొలువుదీర్చారు. ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి కల్యాణం నిర్వహించారు. తర్వాత సహస్రదీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

కండలేరులో 33.731 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 33.731 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,100, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 40, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఫిష్ పాండ్లతో గిరిజనులకు చేయూత

చిల్లకూరు : ఉపాధి హామీ కింద చేపట్టే ఫిష్ పాండ్లతో గిరిజనులకు తోడ్పాటు ఇస్తున్నట్టు ఏపీవో గిరి తెలిపారు. ఆయన శనివారం ఉడతావారిపాళెం పంచాయతీలోని అంకులపాటూరు చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి చెరువులోనూ చేపలు పెంచుకునేందుకు ఉపాధి ద్వారా ఫిష్ పాండ్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వాటిలో గిరిజనులు చేపలు పెంచుకుని విక్రయించుకుని జీవనం సాగించుకునేలా తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభంలోగానే పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.



ఫిష్ పాండ్ పనులను పరిశీలిస్తున్న ఉపాధి ఏపీవో గిరి

అనంతరం పనులు చేస్తున్న కూలీలకు రూ.307లు ఏ విధంగా సంపాదించుకోవాలనే విషయంపై అవగాహన కల్పించారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్, క్షేత్ర సహాయకులు వున్నారు.

ప్రజలకు పులిహోరా ప్యాకెట్ల పంపిణీ

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని ఐసీఎస్ రోడ్డులో వేసవిలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో కొండూరు సుబ్రమణ్యం జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శనివారం ముగించారు. సందర్భంగా 500 మందికి గుగ్గిళ్లు, పులిహోరా ప్యాకెట్లు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, కొండూరు హరి, ఉపాధ్యక్షుడు బండి ధనుంజయరెడ్డి, సెక్రటరీ జి.చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, సభ్యులు శ్రీనివాసులు, మురళీనాయుడు, విశ్రాంత ఎస్‌ఐ ప్రభాకర్, డీవీఎంసీ సభ్యుడు వెంకటేశ్వరరావు, నాగరాజు, పి.శ్రీనివాసులు, పెంచలయ్య, విజయ్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు పులిహోరా ప్యాకెట్లు, గుగ్గిళ్లు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

దుబాయ్‌లో నాయుడుపేట యువకుడి మృతి

నాయుడుపేట టౌన్ : దుబాయ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నాయుడుపేట పట్టణానికి చెందిన మదిరి మునిరత్నం(36) గాయపడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. నాయుడుపేట బలిజ సంఘం ఐక్యవేదిక నాయకులు మదిరి చిట్టిబాబు పెద్ద కుమారుడు దుబాయ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, కుమార్తె ఉన్నారు. మునిరత్నం దుబాయ్‌లో ఇంటి వద్ద శనివారం ఉదయం కాలు జారి కిందపడి గాయపడ్డాడు. అతన్ని వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు నాయుడుపేటలో ఉన్న తల్లిదండ్రులకు సమాచారం అందింది. కొద్ది రోజుల క్రితం మునిరత్నం భార్యాపిల్లలతో కలిసి నాయుడుపేటలో జరిగిన జాతరకు వచ్చాడు. తిరిగి దుబాయ్‌కు వెళ్లారు. దుబాయ్ నుంచి మునిరత్నం మృతదేహాన్ని బుధవారం నాయుడుపేటకు తీసుకువస్తున్నట్లు మృతుడి బంధువులు తెలిపారు.



మునిరత్నం(ఫైల్)

అధ్వానంగా తుమ్మలతలుపూరు రోడ్డు

సైదాపురం: మండలంలోని తుమ్మలతలుపూరు వెళ్లే రోడ్డు అధ్వానంగా వుంది. గ్రామం మధ్యలోనే పంట కాలువ నీరు వెళుతూ ఉంటుంది. రెండు నుంచి మూడు అడుగుల మేర నీరు ప్రవహిస్తూ ఉంటుంది. ఈ రోడ్డు గుండా వాహనాలు ఎక్కువగా వెళుతూ ఉంటాయి. ఈ రోడ్డును బాగు చేయాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.




రోడ్డులో ప్రవహిస్తున్న నీరు

వ్యభిచార గృహంపై దాడి

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని రాజగోపాలపురం 3వ వీధిలోని ఓ ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారంతో శనివారం రాత్రి సీఐ బాబీ పోలీసులతో దాడి చేశారు. విటుడితోపాటు నిర్వాహకురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఆమె నెల్లూరు ప్రాంతానికి చెందిన వారు. ఆమె ఇతర ప్రాంతాల నుంచి మహిళలను రప్పించి వ్యభిచారం చేయిస్తున్నట్టు సీఐ తెలిపారు. నిర్వాహకురాలితో పాటు మరొకరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. పట్టణంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే 9440796357కు సమాచారం ఇవ్వాలని స్థానికులను కోరారు. వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ప్రసన్న వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

చిట్టమూరు : మండలంలోని ఆరూరు గ్రామంలో ఉన్న ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామి వారికి పల్లకి సేవ చేపట్టారు.



అలంకరణలో వెంకటేశ్వర స్వామి

ట్రాఫిక్ నియమాలు పాటించకుంటే చర్యలు



డ్రైవర్లకు సూచనలు చేస్తున్న పోలీసులు

నాయుడుపేట టౌన్ : ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ఎస్‌ఐ ఆదిలక్ష్మీ హెచ్చరించారు. ఆమె శనివారం మేనకూరు సెజ్ పరిధిలోని పలు ప్రధాన రహదారుల వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ బస్సులు మితిమీరిన వేగంతో వెళ్లరాదని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని పేర్కొన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, రికార్డులు లేనివాటిని గుర్తించి జరిమానా విధించారు.

రైల్వే సమస్యలపై ఎంపీ వినతి



తిరుపతి ఎంపీ గురుమూర్తిని కలిసిన కామిరెడ్డి రాజారెడ్డి, నాయకులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి కామిరెడ్డి రాజారెడ్డి, సదరన్ రైల్వే ప్యాసింజర్స్ అసోసియేషన్ నాయకులు శనివారం ఎంపీని తిరుపతిలో కలిశారు. నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. కరోనా సమయంలో నిలిపివేసిన ఎక్స్‌ప్రెస్ రైళ్లను తిరిగి నడిపేలా చూడాలని కోరారు. చెన్నై నుంచి సూళ్లూరుపేట వరకు వచ్చే మెమూ రైళ్ల నాయుడుపేట రైల్వే స్టేషన్ వరకు పొడించాలని తెలిపారు. స్పందించిన ఎంపీ గురుమూర్తి ఫోన్‌లో సదరన్ రైల్వే డీఆర్ఎం, జీఎంలతో మాట్లాడారు. నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో ఎం మస్తానయ్య, ఆర్ రాఘవన్, డీఆర్‌యూసీసీ సభ్యులు పేర్నాటి జోసెఫ్, కంకిపాటి కిరణ్‌కుమార్, రవి, యువత నాయకులు కామిరెడ్డి రాజేష్ రెడ్డి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

గూడూరు రూరల్ : మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని గూడూరు ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శివప్రసాద్ తెలిపారు. ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ శివప్రసాద్ మాట్లాడుతూ మత్తుకు బానిసగా మారితే కుటుంబాలు నాశనం అవుతాయన్నారు. తమ పరిసరాల్లో ఎవరైనా అక్రమంగా మాదకద్రవ్యాలు విక్రయిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసులు, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ బి.పీర్‌కుమార్, కోటేశ్వరరావు, సురేంద్ర, కిరణ్మయి, శ్రీధర్ శర్మ, రవిరాజు, శైలజ, పద్మమ్మ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌కేఆర్ కళాశాల వద్ద ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

టీడీపీలో వర్గ విభేదాలు

- ఆగిపోయిన సంస్థాగత ఎంపికలు
- గ్రామ కమిటీల నుంచే వివాదాలు
- బల ప్రదర్శనలకు దిగుతున్న తెలుగుతమ్ముళ్లు



ఫొటోలు లేకపోవడంపై నేతలను నిలదీస్తున్న కార్యకర్తలు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీలో అగ్ర నాయకులే కాకుండా గ్రామ స్థాయిలోనూ విభేదాలు తారాస్థాయికి చేరాయి. రెండు వర్గాలుగా ఏర్పడి వివాదాలకు దిగి సంస్థాగత ఎన్నికలు కూడా నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గంలో ఇప్పటికే వేనాటి సతీష్‌రెడ్డి, కొండేపాటి గంగాప్రసాద్ వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. పెళ్లకూరు మండలానికి చెందిన శిరసనంబేటి చైతన్యకృష్ణారెడ్డి, నాయుడుపేట నుంచి 786 రఫీ తదితరులు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లారు. వారు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తండ్రి నెలవల సుబ్రమణ్యం వర్గీయులుగా వుంటున్నారు. పాత తెలుగు తమ్ముళ్లు మాజీ మంత్రి పరసా వెంకటరత్నయ్య వర్గీయులుగా కొనసాగుతున్నారు. దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాలకు చెందిన వారు వేనాటి, కొండేపాటి వర్గీయులుగా వున్నారు. పార్టీ సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తున్న సమయంలో విభేదాలు భగ్గుమన్నాయి. నాయుడుపేటలో శుక్రవారం నిర్వహించిన సమావేశం రసాభాసగా మారింది. ఓజిలి మండలం సగుటూరు, ఆర్మేనిపాడు గ్రామ కమిటీల్లోనూ వివాదాలు తలెత్తడంతో సమావేశం ముంగించేశారు. శనివారం సూళ్లూరుపేటలోని సత్యసాయి కల్యాణ మండపంలో ఎన్నిక నిర్వహించారు. ఇక్కడా వివాదం తలెత్తడంతో గ్రామ కమిటీల ఎన్నికలు ఆపేశారు. మరో వారం రోజులు గ్రామాల్లో పర్యటించి ఆయా పంచాయతీలకు కమిటీలను ఎంపిక చేయాలని పరిశీలకులు చెప్పి వెళ్లిపోయారు.

మండల కమిటీ ప్రకటన

గ్రామ కమిటీలను ఎంపిక చేయకుండానే కొన్ని మండలాలకు కమిటీలను ఎంపిక చేసినట్టు నెలవల సుబ్రమణ్యం ప్రకటించడంతో వివాదం చెలరేగింది. పెళ్లకూరు మండలానికి తన వర్గీయుడైన చెంచుకృష్ణయ్యను అధ్యక్షుడిగా ప్రకటించడాన్ని కొంతమంది నాయకులు వ్యతిరేకిస్తున్నారు. శిరసనంబేటి చైతన్యకృష్ణారెడ్డిని ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బ్యానర్‌లో ఫొటోలపైనా వివాదం

పార్టీ గ్రామ, మండల, పట్టణ కమిటీ సమావేశాలకు సంబంధించిన బ్యానర్‌లో పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ ఫొటో లేకపోవడంపై కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం నుంచి వెళ్లిపోయారు. స్థానికంగా పార్టీని బలోపేతం చేసిన స్వర్గీయ వేనాటి మునిరెడ్డి, తిరుపతి పార్లమెంట్ కార్యదర్శిగా వున్న వేనాటి సతీష్‌రెడ్డి ఫొటోలు లేకపోవడాన్ని తప్పుపట్టారు.

పనిభారం తగ్గించాలని వినతి

చిల్లకూరు/రాపూరు/సైదాపురం/కలువాయి(సైదాపురం) : ప్రభుత్వం తమపై పనిభారం పెంచేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పనిభారం తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. వారు శనివారం చిల్లకూరు, రాపూరు, కలువాయి ఎంపీడీవోలు గోపి, భవాని, సైదాపురం ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ మురళీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పంచాయతీల్లో ఉదయం ఆరు గంటల నుంచి 12 వరకు ఏకదాటిగా పలు పనులు చేయాల్సి వస్తోందన్నారు. దీనికితోడు పలు రకాల సర్వేల పేరుతో విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. క్షణం కూడా తీరికలేకుండా పనిచేస్తుండడంతో ఆరోగ్య సమస్యలున్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. పనిభారం తగ్గించాలని నిరసన తెలుపుతూ రాష్ట్ర వ్యాప్తంగా సామూహిక సెలవులు ప్రకటిస్తామని శుక్రవారం పేర్కొన్నప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. శనివారం ఉదయం ఆరు గంటలకు పారిశుద్ధ్యం పనుల ఫొటోలు పెట్టాలని ఆదేశించడం చూస్తుంటే తమతో వెట్టిచాకిరీ చేయించుకునేలా ఉన్నారని వాపోయారు. తమకు సచివాలయాలలో ఉన్న డీడీవో పోస్టును రద్దు చేసి పంచాయతీలోని పనులను మాత్రమే అప్పగించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం సామూహికంగా సెలవు పెడుతున్నట్లు తెలిపారు.



సైదాపురం ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు



చిల్లకూరు ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు



రాపూరు ఎంపీడీవో భవానికి వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు